# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

May / మే-2025

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్



పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్ మహారాజ్

జననం : 1895 మరణం : 1982

## లోకశాంతి ప్రార్థన

(వ్యక్తి శాంతికి - విశ్వశాంతికి)

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా!
మా లోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండియున్న ఓ సర్వాంతర్యామి! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడి యుండి మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము,
ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైక మూర్తీ !
నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.
ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల
ఉత్తర దక్షిణముల, ఈ విశ్వము నందంతటను అందరును
నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక!
ఓ సచ్చిదానంద స్వరూపా !
ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యమునను
శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము.
ఓ దేవా! ఇదియే మా మనః పూర్వకమైన ప్రార్థన.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

\- ఋగ్వేద సంహిత


# శాంతి

# SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

VoL./ సంపుటి : **101** May / మే-**2025** No./ సంచిక : **5**


| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|

| 1. | ప్రార్థన- శ్రీహరివంశ పురాణం చతుర్థభాగము | 2 |
| 2. | ధ్యానము - ఓంకారము (మాండ్యూకోపనిషత్) | 4 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ - అనువాదం : బొప్పన అరుణాదేవి | 5 |
| 4. | ఆనంద రామాయణం - పరిష్కర్త స్వామి సత్యాత్మానంద | 12 |
| 5. | గురువాచకకోవై - వివరణ సాయికృష్ణ | 16 |
| 6. | మానసోల్లాసము - శ్రీ వింజమూరి రాధాకృష్ణ | 19 |
| 7. | అర్థం వ్యర్థం - మలిశెట్టి రంగారావు (బన్ను) | 21 |
| 8. | అనుమానం - గరిగిపాటి కృష్ణ | 22 |
| 9. | కార్యక్రమములు - విరాళములు | 25-28 |



**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/- లు సాలుసరి రూ. 100/-**




# ప్రార్థన

## శ్రీరామచరిత మానసము

**శ్లో॥ హిరణ్యరేతఃస్సుముఖ జ్వలనాహ్వాయ ప్రభోః**
**సప్తజిహ్వానక్షామ లేలిహాన మహాబలః**

**తా॥** సువర్ణవీర్యా! సుముఖా! జ్వలననామ! సర్వమును భుజించువాడా! సప్తజిహ్వాలు కల ముఖము కలవాడా! అందరిని క్షీణింపచేయువాడా! నాకుచున్న నాలుకలు కలవాడా! మహాబలా! నీకు జయమగుగాత!

**శ్లో॥ ఆత్మావాయుస్తవ విభో! శరీరం సర్వవీరుధః**
**యోనిరాపశ్చతే ప్రోక్తా యోనిస్త్వమసిచామ్భసః**

**తా॥** సర్వవ్యాపకా! నీకు వాయువు ఆత్మ. సకల వృక్షములు వనస్పతులు తమ శరీరము. తమ పుట్టుక నీరునుండి, నీరు పుట్టుక తమనుండి అని చెప్పెదరు.

**శ్లో॥ ఊర్ధ్వం చాధశ్చగచ్ఛన్తి సఞ్చరన్తిచ పార్శ్వతః**
**అర్చిషస్తే మహాభాగ సర్వతః ప్రభవన్తిచ**

**తా॥** మహానుభావా! నీ జ్వాలలు పైకి కిందికి ప్రక్కలకు సంచరించును. అంతట ప్రభవించును.

**శ్లో॥ త్వమేవాగ్నే సర్వమసి త్వయిసర్వమిదం జగత్**
**త్వంధారయసి భూతాని భువనం త్వం బిభర్షిచ**

**తా॥** అగ్నీ! నీవే అన్నీ, ఈ సకల జగత్తు నీవే. సకలప్రాణులను నీవే ధరించుచున్నావు. ప్రపంచమును నీవే భరించుచున్నావు.

**శ్లో॥ త్వమగ్నే హవ్యవాడేకస్త్వమేవ పరమం హవిః**
**యజన్తిచ సదాసన్త స్త్వామేవ పరమాధ్వరే**

**తా॥** హవిస్సును వహించువాడవు నీవు ఒక్కనివే. ఉత్తమ హవిస్సు నీవే. సత్పురుషులు ఉత్తమ యజ్ఞమున అన్నివేళలా నిన్నే ఆరాధింతును.

**శ్లో॥ తమన్నం ప్రాణినాం భుఙ్క్షే జగత్రాతాసిత్వం ప్రభోః**
**త్వయి ప్రవృత్తో విజయస్త్వయి లోకాః ప్రతిష్ఠితాః**

**తా॥** సకల ప్రాణుల అన్నమును నీవే తినుచున్నావు ప్రభూ! నీవే జగమును

కాపాడుచున్నావు. విజయము తమయందే ప్రవర్తించును. లోకములన్నీ తమలోనే ప్రతిష్ఠించబడియున్నవి.

**శ్లో॥ సర్వాంల్లోకాం స్త్రీనిమాన్ హవ్యవాహ-ప్రాప్తేకాలే త్వం పచస్యే వదీప్తః**
**త్వమేవైక స్తపసే జాతవేదో-నాన్యస్త్వత్తో విద్యతే గోషుదేవ!**

**తా॥** హవ్యవాహా! ప్రళయకాలము వచ్చినపుడు ఈ మూడు లోకములను నీవు జ్వలించుచు కాల్చుచు వండుచున్నావు. వేదములచే తెలియబడువాడవు నీవు ఒక్కడివే. సూర్యరూపముతో తపింపచేతువు. నీ ఈ కిరణములలో నీవు తప్ప తపింప చేయునది ఇంకొకటి లేదు.

**శ్లో॥ వృషాకపిస్సిన్ధు పతిస్త్వమగ్నే-మహామఖేష్వగ్ర్య హరస్త్వమేవ**
**విశ్వస్య భూమ్నస్త్వమసి ప్రసూతిః-త్వం చ ప్రతిష్ఠా భగన్ప్రజానామ్**

**తా॥** అగ్నీ! తామే సూర్యరూపమున జలమును కురిపించువాడవు. జలమును ఇంకింపచేయువాడవు నీవే. మహాయాగములలో అగ్రహవిర్భాగమును గ్రహించువాడవు నీవే. సకల చరాచర విశ్వమునకు ఉత్పత్తిస్థానము నీవే. ఈ ప్రజలకు ప్రతిష్ఠ కూడా నీవే.

**శ్లో॥ సృజస్యపో రశ్మిభిర్జాతవేదః-తథోషధీ రోషధీనాం రసాంశ్చ**
**విశ్వం త్వమాదాయ యుగాన్తకాలే-స్రష్టాభవస్యానల సర్గకాలే**

**తా॥** వేదములచే తెలియబడువాడా! నీ కిరణములచే జలమును సృజించుచున్నావు. అట్లే ఓషధుల రసములను సృజించుచున్నావు. ప్రళయకాలమున ప్రపంచమున నీలో లయము చేసుకుందువు. సృష్టికాలమున మరల సృష్టి కాలమున మరల చేయుదువు.

**శ్లో॥ త్వమగ్నే సర్వభూతానాం యోనిర్వేదేషు గీయసే**
**త్వయాదేవ హితార్థాయ నిహతా దానవా రణే**

**తా॥** సకల ప్రాణులకు కారణము నీవేనని వేదములలో గానము చేయబడుచున్నది. దేవతల హితము కొరకు నీవు దానవులను వధించితివి.

**శ్లో॥ స్వయోనిస్తే మహాతేజస్తోయం మఖశతార్చితః**
**తాం స్వయోనిం సమాసాద్య కిం విషీదసి పావకః**

**తా॥** నూర్ల యజ్ఞములచే అర్చించబడువాడా! మహాతేజస్వీ! జలము నీకు



స్వయముగా కారణము. నా కారణమును చేరిన నీవు ఏల విషాదమును పొందుచున్నావు?

**శ్లో॥ త్రాయస్వ సమరే దేవాన్ దైత్యేభ్యస్సురసత్తమ**
**పిఙ్గాక్ష లోహితగ్రీవ కృష్ణవర్త్మన్ హుతాశన!**

**తా॥** సురసత్తమా! యుద్ధమున దైత్యులనుండి దేవతలను కాపాడుము పిఙ్గాక్షా! లోహితాగ్రీవా కృష్ణవర్త్మా! హుతాశనా! కాపాడుము.

**ఇతి శ్రీమహాభారతే ఖిలభాగే హరివంశ మహాపురాణే భవిష్యపర్వణి వామనప్రాదుర్భావే అగ్నిస్తవే ద్విషష్టితమోఽధ్యాయః**

**ఇది శ్రీమహాభారతమున ఖిలభాగమున హరివంశ మహాపురాణమున భవిష్యపర్వలో వామనప్రాదుర్భావమున అగ్నిస్తవమున అరువది రెండవ అధ్యాయము.**

## ధ్యానము

**కా॥ ఓంకారం పాదశో విద్యాత్ పాదామాత్రా న సంశయః ।**
**ఓంకారం పాదవో జ్ఞాత్వా నం కించిదపి చిన్తయేత్॥**

**తా॥** ఓంకారములోని ప్రతిపాదమును ప్రత్యేకముగా తెలిసికొనవలయును. ఆ పాదములు నిస్సంశయముగా మాత్రలే యగుచున్నవి. ఇట్లు ఓంకారమును సంపూర్ణముగా తెలిసికొనిన పిమ్మట మరిదేనిని చింతించకూడదు.

పక్వం, అపక్వం అని అహంకారం రెండు విధాలు. “ఇది నా ఇల్లు, నా గది, నా కుమారుడు” యీ భావం గలది. పక్వంకాని అహంకారం, పక్వమైన అహంకారం. “నేను దేవుడి సేవకుణ్ణి”, “నేను అతడి బిడ్డను”, నేను నిత్యముక్తుణ్ణి”, “జ్ఞానస్వరూపుణ్ణి” అని భావించేటట్టిది. **– రామకృష్ణుల ఉపదేశ రత్నాలు**

సకల జగత్తు యొక్క ఉనికి కేవలము పరమాత్మ యందు మాత్రమే గలదు
**– స్వామి తత్త్వ విదానంద**

ఎవరికి నీవు శివుడిగా దర్శనమిస్తావో, ఎవరికి నీవు విష్ణువుగా దర్శనమిస్తావో, ఎవరికి నీవు బుద్ధుడిగా, అల్లాగా, సాయిగా, క్రీస్తుగా దర్శనమిస్తావో వారందరిలోనూ, నీ అవతారాలన్నింటిలో నేను నిన్ను ఒకే భగవంతుడిగా, పరమాత్మగా గుర్తిస్తున్నాను అని భావన చేయుము. **– సూక్తి ముక్తావళి**

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

**మూలం : స్వామిఓంకార్** **అనువాదం : బొప్పన అరుణాదేవి**

**(గత సంచిక తరువాయి) అధ్యాయం - 58**

## కోటగిరిలో శాంతి కేంద్రము

**తోటపల్లి నుండి కోటగిరికి, అక్టోబరు 1957**

భగవంతుని దారులు చిత్రవిచిత్రంగా, అనూహ్యంగా ఉంటాయి. ఆయన ఒకే మూలానికి చెందిన ఆత్మస్వరూపులను విచిత్రంగా కలిపి ఆయన బిడ్డలకి సేవలు అందిస్తాడు. చాలా కాలమునుండి తోటపల్లి కొండల్లోని శాంతి ఆశ్రమాన్ని దర్శించడానికి వచ్చే లలిత అనే భక్తురాలు తమిళనాడులోని నీలగిరి కొండల్లోని ప్రదేశానికి నన్ను రమ్మని ఎంతో గౌరవంగా ఆహ్వానించింది. అక్కడ అనేకమంది భక్తులు శాంతి సందేశాలను వినటానికి ఆతురత చెందుతున్నారని తెలిపింది.

నేను ఎప్పుడూ గాఢమయిన ధ్యానములో కాలము గడపాలని, మౌనంగా ఉండాలని కోరుకుంటాను. ఆశ్రమాన్ని వదిలిపెట్టి ఇతర కేంద్రాలకి వెళ్ళాలని భావించను. అందువలన ఆమెను క్షమించమని చెప్పాను. తప్పకుండా ఆమె కోరిక నెరవేరుస్తానని కనీసం నాకు ఆరునెలల గడువు ఇవ్వమని చెప్పాను. ఆమె పదే పదే ఉత్తరాలు వ్రాస్తుండేది. అయినా ప్రతిసారి కూడా నేను ఆలస్యం చేసేవాడిని. ఆంధ్రాలోని వివిధ ఆశ్రమాల పనుల వత్తిడి వల్ల వెళ్ళలేకపోయాను.

చివరికి ఆమె వ్రాసిన ఉత్తరము నాకు అందింది. అందులో ఆమె నన్ను ప్రశ్నించింది. "ఎవరయినా వ్యక్తి దాహంతో త్రాగటానికి మంచినీళ్ళు అడిగితే అప్పుడు కూడా మీరు అతడిని ఒక సంవత్సరం తర్వాత రమ్మని సందేశం ఇస్తారా?" అని. అది చదివిన వెంటనే నేను అక్కడికి వెళ్ళడానికి వెంటనే ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరముందని అనిపించి తోటపల్లి నుండి సెప్టెంబరు 16వ తేదీన బయలుదేరాలి అని నిశ్చయించబడింది.

నేను తొందరగానే మేల్కొన్నప్పటికీ, నాకు వెన్ను నొప్పి రావటం మొదలయింది. అప్పటికి మేము నా కాలికి గాయం అయి బాగా వాచిపోవటం వలన అనుకున్న ప్రయాణాన్ని వాయిదా వేశాము. మళ్ళీ ప్రయాణాన్ని వాయిదా వేయటం సబబుగా అనిపించలేదు. ముందుగానే మా ప్రయాణం గురించి తెలుసుకున్న అనేకమంది భక్తులు అనేక ప్రాంతాలవారిని, లలితాదేవిని నేను నిరాశపర్చదలచుకోలేదు. పిఠాపురం నుండి స్నేహితులు నా కోసం వాహనాన్ని సిద్ధం చేశారు తుని రైలు



స్టేషను వరకు వెళ్ళడానికి ప్రయాణాన్ని వాయిదా వేయలేము. కనుక వెన్ను నొప్పి తగ్గటానికి వేడినీటి కాపడం పెట్టుకొని నెమ్మదిగా ప్రయాణము ఏర్పాట్లు చేసుకున్నాము. ఆశ్రమవాసులందరితో కలిసి ప్రార్థనలు చేసి చివరికి నిత్యానంద స్వామీజీతో ఆయన సోదరితో కలిసి ఉదయము 10-30 నిముషములకు వాహనంలో బయలుదేరాము.

వర్షాలు విపరీతంగా పడటం వలన రోడ్లు అన్నీ బాగా గుంటలు పడి నీరు నిల్చిపోయింది. ఆ ఇరుకుల దారిలో గతుకుల దారిలో ప్రయాణం చేయటము చాలా ప్రమాదమే, సరాసరి స్వర్గానికి చేరుస్తుంది. నిజానికి చెప్పాలంటే స్వర్గం చేరుకునే మార్గం ఎల్లప్పుడూ పడిపోయే గోతులతో, ఎండమావులతో నిండి ఉంటుంది. నేను చెప్పిన విషయం నాపాఠకులకు క్రొత్తగా అనిపించవచ్చును. తుని స్టేషను చేరుకునేసరికి కారు దారి పొడగునా ఎగిరి పడటము వలన కాబోలు నా వెన్నునొప్పి పూర్తిగా మటుమాయమయి పోయింది. అక్కడి నుండి మేము మెయిల్ ఎక్స్‌ప్రెస్‌లో మద్రాసు చేరుకోవాలి. చాలామంది స్నేహితులు కలుసు కున్నారు. అందరము కలిసి ధ్యానము, ప్రార్థనలు చేశాము. 'కృష్ణాజీ' అనే పిల్లవాడు చక్కగా ప్రార్థన చేశాడు. అలాంటి అమాయకమయిన పవిత్ర హృదయం కల పిల్లలు భగవంతుని సామ్రాజ్యానికి చెందినవారు.

దారిలో మేము పిఠాపురం, సామర్లకోట, రాజమండ్రి మరియు విజయవాడ రైల్వే స్టేషన్లలో ఆగినప్పుడు ఎందరో ఆశ్రమ భక్తులు ప్లాట్‌ఫారంపై కలుసుకుని పూలు పళ్ళు సమర్పించారు. మిఠాయిలు తెచ్చారు.

విజయవాడలో ఇద్దరు విమానం నడిపేవారు పైలెట్లు మా రైలులో ఎక్కారు. వారు మాకు ప్రణామాలు చేసిన తర్వాత ప్రపంచ పరిస్థితులను గురించి మాట్లాడటం మొదలు పెట్టారు. వారికి సిగరెట్లు త్రాగే చెడ్డ అలవాటు ఉండటం వలన దానికై మా అనుమతి కోరారు. వారు దేశాధ్యక్షుడి నుండి ప్రధానమంత్రి దాకా అందరి గురించి మాట్లాడుతూ ఒకదాని తర్వాత ఒకటిగా సిగరెట్లు కాలుస్తూనే ఉన్నారు. రైలు బోగి మొత్తం సిగరెట్ల పొగతో నిండిపోయింది. కొంతసేపటికి నాకు కూడా సిగరెట్టు పీల్చిన అనుభూతి కలిగింది. ఎందుకంటే ఆ సిగరెట్ల పొగను వాసనని అంతవరకూ ఊపిరిగా పీలుస్తున్నాము కనుక. ఈ విధంగా ఎవరయినా మంచి పనిగాని, చెడుపని గాని ఇతరుల సాంగత్యం వలన నేర్చుకుంటారు.

మద్రాసు స్టేషన్‌లో 'ఉపనిషత్ విహార్' స్వామీజీ రాజేశ్వరానంద గారు వచ్చి మాకు స్వాగతం పలికి మేము వచ్చిన దగ్గరినుండి తిరిగి నీలగిరి ఎక్స్‌ప్రెస్ ఎక్కే

వరకూ మాకు కావల్సిన సౌకర్యాలన్నీ చూసుకొన్నారు. ఇంకా ఎందరో స్నేహితులు కూడా పూలదండలతో మాకు స్వాగతం పలికారు. అక్కడ మేమున్న ఆ కొద్ది సమయంలోనే బొబ్బిలి మహారాణి గారి అందమయిన గృహానికి వెళ్ళి అక్కడ ప్రార్థనలు, ధ్యానము చేశాము. ఒక పవిత్రమయిన పుణ్యక్షేత్రంలో లాగా అక్కడ మేము గడిపిన క్షణాలు ఎంతో అద్భుతంగా, ప్రశాంతంగా, పవిత్రమయిన అనుభూతిని కల్గించాయి.

మద్రాసు నుండి కోటగిరికి మేము "బ్లూమౌంటెన్ ఎక్స్‌ప్రెస్'లో బయలుదేరాము. మా రైలు బోగీలో ఇద్దరు కొత్త భక్తులు, తర్వాత ఆశ్రమ శ్రేయోభిలాషుల అయ్యారు. శాంతి ప్రార్థనని గుర్తు చేస్తుంటాను. స్వామి నిత్యానంద ఎంతో అంకితభావంతో నాకు కావాల్సిన సదుపాయాలన్నీ చూసుకున్నారు. కోయంబత్తూరులో శ్రీ ఎస్.కె.డి. అయ్యర్ గారు తన స్నేహతులు, నిస్వార్థ సేవకులు, ఆధ్యాత్మిక హీలింగ్ కేంద్రము సభ్యులతో కలిసి స్టేషన్‌కి వచ్చి పూలమాలలు, పళ్ళు సమర్పించి ఘనమైన స్వాగతం పలికారు. వారందరూ కూడా శాంతి ప్రార్థనని పాడటం నాకు ఆశ్చర్యం కల్గించింది.

మేట్టుపాలయం స్టేషనులో మాకోసం కారు సిద్ధంగా ఉంది. మా సామాన్లు శాంతి సందేశాలతో కూడిన సాహిత్యం, పళ్ళబుట్టలు కారులో ఎక్కించాము. అక్కడి నుండి కోటగిరికి బయలుదేరాము. మేట్టుపాలయం నీలగిరి కొండలకి తలుపు లాంటిది. అందమయిన నీలగిరి కొండలు మమ్మల్ని ఆహ్వానిస్తున్నట్టుగా ఉన్నాయి. మేము సుఖంగా, సౌకర్యంగా ప్రయాణించడానికి కారు ఏర్పాట్లుచేసిన లలితాదేవి ఆ కారును నడిపే వ్యక్తితో స్వాగత పత్రాన్ని పంపించింది.

అక్కడి స్టేషనులో జరిగిన చిన్న సంఘటన నా హృదయాన్ని బలంగా కదిలించింది. ఒక నిరుపేద మహిళ తన కుమార్తెతో కలిసి భిక్షమెత్తుతోంది. ఆ అమ్మాయి నా వెంటపడి 'స్వామియార్', స్వామియార్' అని పిలవసాగింది. ఆమె నా నుండి కొద్ది పైసలు ఆశిస్తోంది అనుకొన్నాను. ఆశ్చర్యంగా పైసలు బదులుగా ఆ అమ్మాయి నా చేతిలోని పూలగుత్తిని ఇవ్వమని బ్రతిమాలసాగింది. నేను ఆమె చిన్న కోరికను కాదనలేక నా చేతిలోని అందమైన పూలగుత్తిని ఆమెకిచ్చాను. ఆ చిన్నపాప మధురమైన ముఖం ఆనందంతో సంతోషంగా సంతృప్తిగా వికసించింది. ఆ నవ్వు స్వర్గలోకపు వాసులది. నేనే దివ్యానుభూతిలో కన్నీరు కార్చాను. ఆ దివ్యక్షణాలు భగవంతుని పవిత్రమయిన దివ్యానుభూతిని కలిగించాయి. భగవంతుడు మన వద్దకు ఏదో ఒక రూపంలో రోగిలాగా, పేదవారిలాగా వివిధ రూపాల్లో వస్తుంటాడు. అప్పుడు మనము వారికి సేవ చేసి, పూజించి ఆ భగవంతుని దర్శించ



గల్గటం మన అదృష్టం. ఇతరులను సంతోష పెట్టడం వలన మనము కూడా సంతోషంగా జీవించగల్గుతాము. మానవులను ప్రేమించటమే మాధవుడిని ప్రేమించటం.

**కోటగిరిలో శాంతి కేంద్రము, లక్ష్మీకుటీరము**

గడ్డిపరక కూడా భగవంతుని సంకల్పము లేకుండా కదలలేదు. భగవంతుడు దసపల్లా రాణి సాహెబా మరియు రాజా సాహెబాలకు సంకల్పం కలిగించి వారి విలువైన భూమిని కోటగిరిలో చాలా తక్కువ ఖరీదుకి శాంతి కేంద్ర స్థాపనకు ఇచ్చేలా చేశాడు. ప్రపంచంలోని వారందరి హృదయాలకి శాంతిని ప్రసారం చేయటము భగవంతుని కార్యమే కదా!

లక్ష్మీ కుటీరము ప్రధానమయిన భవనము, అందులో నాలుగు పడక గదులు న్నాయి. ప్రతిదానికి స్నానపు గది, అలంకరించుకునే గది ఉంటాయి. అతిథులు ఉండేందుకు పెద్ద హాలు, రెండు వరండాలు, భోజనశాల, దానికి అనుబంధంగా వంటశాల ఉన్నాయి. అంతేకాకుండా ఇంకొక కుటీరములో పడక గది, స్నానపు గది కూర్చోవడానికి వేరే గది, వంటగది, పనిచేసేవారికి విడిగా గదులు ఆరు కుటుంబాలు ఉండేందుకు అనువుగా ఉంది. అన్ని గదుల్లో మంచి ఖరీదయిన వస్తువులు, సామగ్రి ఉన్నాయి. లక్ష్మీ కుటీరానికి ఆరు ఎకరాల భూమి, చక్కని ఉద్యానవనము, ఫియర్ వృక్షాలుండేవి.

కోటగిరిలోని మా శాంతికేంద్రాన్ని శాంతికి నిజమయిన నిలయంగా, దేవాలయం లాగా తీర్చిదిద్దాలని, సత్యాన్వేషకులందరికి తూర్పు పడమర దేశాల వారికి అన్ని దేశాల వారికి, మతాల వారికి స్థానం కల్పించాలని సంకల్పించాము. ముందుగా గ్రంథాలయము, అందులో ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలుంచాము, చదువుకోవడానికి ప్రత్యేకంగా ఒక గది, ప్రశాంతంగా ధ్యానము చేసుకోవడానికి ధ్యాన మందిరము ఏర్పాటు చేశాము.

**శాంతి కేంద్రము ఆదర్శాలు**

1. ప్రపంచంలోని అన్ని మతాలు వేరువేరుగా వ్యక్తపరచినప్పటికి, అన్ని మతాల సారాంశము ఒక్కటే సత్యము లేదా యథార్థము అయి ఉంది.

2. మన ఉనికికి న్యాయం చేయాలంటే భగవంతుని సన్నిధిని మన లోపల, బయటా, ఇప్పుడు, ఇక్కడే అనుభూతి చెందాలి.

3. మనము సంతోషంగా, ఆనందంగా ఉండాలంటే భౌతికమయిన దేహముతో

సంపర్కము కాకుండా భగవంతునిలో సంపర్కము కల్గి ఉండాలి. దేహ స్పృహ మనకు దుఃఖాన్ని కలిగిస్తుంది.

4. మన అహంకారాన్ని అణిచివేయడానికి మనస్సును నియంత్రణలో ఉంచుకోవటానికి ప్రాణాయామముతో కూడిన ధ్యానము అభ్యసించాలి. దానివలన వ్యక్తిగత శాంతి లభిస్తుంది. ఆ శాంతి ప్రపంచ దేశాల మధ్య శాంతి సామరస్యాలకి దారితీస్తుంది.

5. ఆత్మసాక్షాత్కారము లేదా పరిపూర్ణత్వము అనేది సమస్త మానవాళికి సేవలందించడం ద్వారా భగవంతుని గుర్తించిన వారు మాత్రమే నిస్వార్థపూరితమయిన సేవలందించ గలుగుతారు.

6. ఇతరులపై ఆధారపడటము, నిస్సహాయత మొదలైన పెడత్రోవ పట్టించే విషయాలను పూర్తిగా వదలించుకుని తనలోనే నెలకొనివున్న దివ్యత్వాన్ని గుర్తించాలి.

7. అందరూ కూడా ఈ శాంతి కేంద్రంలో జరిగే కార్యక్రమాలకి ఆహ్వానితులే. వారు తమ స్నేహితులను, సన్నిహితులను శాంతి కార్యక్రమాల్లో పాలుపంచుకొనేందుకు తీసుకురావచ్చు. ప్రపంచంలోని ఏ బజారులో దొరకని అమూల్యమయిన ధనాన్ని వెచ్చించినా కూడా దొరకని శాంతిని ఇక్కడ మీరు ఉచితంగా పొందవచ్చును. అన్ని మతాలకి చెందిన ఆత్మస్వరూపులు వారి వారి ఆరాధనా పద్ధతుల్లో భగవంతుని ఆరాధనలో పాలుపంచుకోవచ్చును. ఎందుకంటే అన్ని మార్గాలు ఒకే గమ్యాన్ని చేరుకుంటాయి. నదులన్నీ చివరికి సముద్రాన్ని చేరుకున్నట్లుగా.

8. "భగవంతునితో కలిసి జీవించు, అలా జీవించటం కోసం ఇతరులకు సహాయం చేయి" ఇదే శ్రీ శాంతిఆశ్రమము యొక్క ఆదర్శము. ఆశ్రమము ప్రారంభించి నలభై అయిదు సంవత్సరాలు అయింది. భగవంతుడే మనలందరినీ సృష్టించాడు కదా!

భగవంతునికి మనము ధన్యవాదాలు సమర్పించుకోవాలి. ఇంత అద్భుతమైన కానుక మనకి ప్రసాదించినందుకు. మానవ ప్రయత్నంతో పనులు నెరవేరాలి అంటే దానికి ఎంతో కష్టపడాలి. ఎన్నో ఇబ్బందులు, ఆటంకాలు ఎదుర్కోవాలి. కాని ఎప్పుడయితే భగవంతుడు మనలను ఆశీర్వదిస్తాడో అప్పుడు మనము చేసే మంచి పనులు సంతోషంగా, తేలికగా, ప్రణాళికాబద్ధంగా జరుగుతాయి. మానవ ప్రయత్నాలు ఎలా ఉంటాయంటే, మండు వేసవిలో తాటి ఆకులతో చేసిన విసనకర్రతో విసురుకున్నట్లుగా ఉంటాయి. భగవంతుని అనుగ్రహము ఎలాంటిది అంటే ప్రాణం



పోసే చల్లని గాలిలాగా, దివ్యత్వం నింపుకున్న పిల్లగాలిగా, చల్లగా, ఉల్లాసంగా ఎలాంటి శ్రమ ప్రయత్నం లేకుండా అందరికీ మలయమారుతంలా అందే చల్లని గాలిలా ఉంటుంది.

భగవంతుని లీలలు ఊహించలేని విధంగా, పరమ అద్భుతంగా ఉంటాయి. మానవుని పరిమితమయిన ఊహకి అవి అందవు. ఆయన మనలను ఎన్నుకొని చక్కని పరికరాల్లాగా ఉపయోగించుకుంటాడు. లక్ష్మీ కుటీరం మొదట్లో ఒక నెల రోజుల కోసం ఇచ్చారు. రెండవ సంవత్సరం రెండు నెలలపాటు శాంతి కార్యక్రమాల కోసం ఇచ్చారు. మూడవ సంవత్సరం వచ్చేసరికి దాన్ని శాంతి కేంద్రం నిర్వహిస్తున్న కార్యక్రమాల కోసం శాశ్వతంగా ఇచ్చివేశారు.

మేము ఆ అందమయిన ప్రశాంతమయిన లక్ష్మీ కుటీరాన్ని దాని చుట్టూ ఉన్న భూమిని కొన్నప్పుడు దయాగుణము గల జమిందారు నాతో "స్వామీజీ! మీరు దేవుని కార్యాన్ని జరిపిస్తున్నారు. అందువలన కుటీరాన్ని, భూమిని కూడా మీకు ఉచితంగా ఇచ్చివేయాలని మా మనస్సులో ఉంది కానీ దురదృష్టవశాత్తూ మేము అలా ఇవ్వలేము. అందువలన అందులోని ఖరీదయిన సామాన్లకు కొద్ది మొత్తము వెలకట్టి ఇవ్వండి. దానితోనే మేము తృప్తిపడతాము" అని చెప్పాడు. దాని కోసము ఫలానా తారీఖు లోపల డబ్బు ఇవ్వాలని నిర్ణయించారు. మేము వారికి దాని కోసము ఇరవైవేల రూపాయలు ఇవ్వడానికి అంగీకరించాము.

నా నలభై సంవత్సరాల జీవితకాలము చేసిన పనులు అన్నీ ఆశ్రమాలు, వాటి ఆస్తులు అన్నీ కూడా కమిటీ పేరు మీదే రిజిష్టరు చేశాము. కమిటీలోని సభ్యులందరూ మంచి పేరున్నవారు, నిస్వార్థపరులు, అంకితమయిన మనస్సు గల ఆత్మస్వరూపులు. ఓంకార్ స్వామీజీకి ఏమి చెందవు. ఇంక చెప్పాలంటే స్వామీజీ జీవించి లేరు. కేవలము 'ఓంకారము' మాత్రమే జీవించి ఉంది. ప్రతి ఒక్కరిలో తనను తాను తెలియ చేసుకుంటున్నారు. అలాగే కోటగిరిలోని శాంతి కేంద్రము కూడా కమిటీ పేరు మీదే రిజిష్టరు చేయబడింది. అది సోదర సోదరీమణులయిన భక్తులందరికి సమానంగా చెందుతుంది. ఎలాంటి విశ్వాస బేధము, దేశ, జాతి బేధాలు ఉండవు. మేనేజింగ్ కమిటీలో కూడా నా పేరు లేదు. నేను సంతోషంగా, స్వతంత్రంగా, స్వేచ్ఛగా ఒక పక్షిలాగా జీవించాలనుకుంటాను. అందుకే ఏదీ నాకు చెందదు. అన్నీ మీకే చెందుతాయి. స్వామీజీ మరణించారు. కేవలము ఓంకార్ మాత్రమే మీ అందరి కోసం జీవించి ఉన్నారు.

ఒక మంచి రోజున లలితాదేవి ప్రార్థనా మందిరానికి శంకుస్థాపన చేసింది.

కోటగిరిలోని భక్తబృందమంతా విశ్వశాంతి కార్యక్రమానికి హాజరయ్యారు. మేమందరము కలిసి పూజలు, భజనలు, ప్రార్థనలు మొదలయినవి చేసి భగవంతుని దివ్యానుగ్రహము కోసం ఈ గొప్పకార్యము విజయవంతం కావాలని ప్రార్థించాము. ధ్యాన మందిరం పూర్తి అయిన తర్వాత అందులో ఆరు వందల మంది కూర్చోవటానికి అవకాశం ఏర్పడింది. ఎంతో విలక్షణమయిన ప్రత్యేకతలున్న విశ్వశాంతి చిహ్నము అన్ని మత విశ్వాసాలకు ప్రతీకగా దేవాలయంలో నెలకొల్పాము. రంగు రంగుల దీపాలతో అలంకరించి భక్తుల హృదయాల్లో ఆనందాన్ని విశ్వాసాన్ని నింపాము.

విశ్వశాంతి ధ్యానమందిరంలో ప్రక్కనే దానిని ఆనుకొని నాలుగు గదులు సాధువులు, మహాత్ములు విడిది చేసేందుకు వీలుగా ఏర్పరిచాము. ఒక ప్రత్యేకమయిన గ్రంథాలయము, హాస్పిటలు దానిని ఆనుకొని ఉన్నాయి. విశ్వశాంతి చిహ్నము వింత వింత రంగుల దీపాలతో వెలిగిపోతూ భగవంతుని బిడ్డలందరికీ వెలుగును ప్రసాదిస్తుంది. సాధువులు, గృహస్థులు, పండితులు, పామరులు, ధనవంతులు, పేదవారు, ఆరోగ్యవంతులు, రోగులు అనే భేదము లేకుండా అందరికీ విశ్వశాంతి చిహ్నము వెలుగులు ప్రసాదించుగాక!

**ఓం....ఓం....ఓం....**

నిజమైన భక్తుడు సుఖ దుఃఖముల యెడ ఉదాసీనుడై ఉండును. భక్తునికి ఆపదలు వచ్చినా, సంతోషము లభించినా, కృంగిపోక, పొంగిపోక అంతా భగవంతుని ఇచ్ఛయని ఎల్లప్పుడు ఆనందంగానే ఉండును. కొంతమంది భక్తుని చూసి హేళన చేయుదురు. వీడికి ఎప్పుడు దేవుని ధ్యాసే తప్ప మరేది పట్టదు. వీడెందుకు పనికిరాని వాడందురు. కొంతమంది ఎంతటి భక్తుడు, ఎంతటి మహాత్ముడు అందురు. ఎవ్వరు ఏ విధంగా అన్నా భక్తుడు చలించడు. భగవంతుని సేవలో లీనమై అదే పరమావధిగా తలంచుచు ఉన్నదానితో తృప్తిగలవాడై నిత్యానందాన్ని పొందుచుండును. ఒక్కొక్కసారి సంసార మోహం కమ్ముకొనును. అయినను చలించడు. ఇది అంతా భగవంతుని లీలగా భావించి ఆ లీలా నాటక చక్రవర్తిని ఊహించుకొనుచు 'హే భగవాన్! నన్ను పరీక్షిస్తున్నావా? ఈ సంసారం అనే మాయలో పడి నిన్ను మరుస్తాననుకున్నావా? ఏమైనా నీ పాదాలు విడువను" అని ప్రార్థించుచుండును. **– సద్గురు సుభాషితాలు**

స్వార్థచింతనయే బంధన, దుఃఖహేతువు, ఇతరులకై జీవించుచు, ఇతరులకై యోచించుటయే స్వేచ్ఛ. **– ఓంకార సూక్తులు**

మీకంటే పెద్దస్థాయిలో వున్నవాళ్ళపై ఎంత గౌరవం అభిమానం చూపుతారో, చిన్నస్థాయిలో వున్నవాళ్ళపై కూడా అంతే అభిమానం గౌరవం చూపండి.

**– సద్గురు సుభాషితాలు**



# ఆనంద రామాయణము

(గత సంచిక తరువాయి) **పరిష్కర్త : స్వామి సత్యాత్మానంద**

అథ గచ్ఛతి శ్రీరామే మైథిలాద్యోజనత్రయమ్ ।
నిమిత్తాన్యతిఘోరాణి దదర్శ నృపసత్తమః ॥ 341

నత్వా వసిష్ఠం ప్రపచ్ఛ కిమిదం మునిపుంగవ ।
నిమిత్తాహదృశ్యంతే విషమాని సమంతతః ॥ 342

వశిష్ఠస్తమథో ప్రాహ భయమాగామి సూచ్యతే ।
పునరప్యభయం తేఽద్య శీఘ్రమేవ భవిష్యతి ॥ 343

మృగాః ప్రదక్షిణంయాంతి త్వాం పశ్య శుభసూచకాః ।
ఏవం వై వదతస్తస్య వవౌ ఘోరతరోఽనిలః ॥ 344

ముష్ణంచక్షూంషి సర్వేషాం పాంసువృష్టిభిరర్దయత్ ।
తతో దదర్శ పరమం జాగద్భ్యం మహాప్రభమ్ ॥ 345

నీలమేఘనిభం ప్రాంశుం జటామండలమండితమ్ ।
ధనుః పరశుహస్తం చ సాక్షాత్కాలమివ స్థితమ్ ॥ 346

కార్తవీర్యాంతకం రామం దృప్తక్షత్రియమర్దనమ్ ।
ప్రాప్తం దశరథస్యాగ్రే రక్తాస్యం రక్తలోచనమ్ ॥ 347

తం దృష్ట్వాభయసంత్రస్తో రాజా దశరథస్తదా ।
అర్ఘ్యాదిపూజాం విస్మృత్య త్రాహిత్రాహీతి చాబ్రవీత్ ॥ 348

దండవత్ప్రణిపత్యాహ పుత్రప్రాణాన్ ప్రయచ్ఛ మే ।
ఇతి బ్రువంతం రాజానమనాదృత్య రఘూత్తమమ్ ॥ 349

ఉవాచ నిష్ఠురం వాక్యం క్రోధాత్ప్రచలితేంద్రియః ।
త్వం రామ ఇతి మన్నామ్నా చరసి క్షత్రియాధమః ॥ 344

## పరశురామ ఆగమనము

మూడామడల దూరమున శ్రీరాముడు వచ్చుచుండగా, దశరథుడు దారుణములైన దుశ్శకునములను చూచి, వసిష్ఠులతో, "స్వామీ! ఏమిది? ఎచ్చట చూచినను దుర్నిమిత్తములు కనబడుచున్నవి," అని నమస్కరించి అడిగెను. అందుకు

మునివర్యుడు, “రాబోవు భయమును సూచించుచున్నది, మరల నేడు నీకు త్వరగానే అభయము కాగలదు, మృగములు శుభసూచకములై నిన్ను చూచుచు ప్రదక్షిణముగా పోవు చున్నవి,” అని చెప్పుచున్నంతలో, చండమారుతము వీచెను. అందరు ధూళి వానచే కండ్లుక్రమ్మి కష్టము నొందిరి. అపుడు గర్వించిన రాజులు గర్వమణచిన కార్తవీర్యాంతకుడను కీర్తినొంది, ప్రత్యక్ష యమునివలె వచ్చుచున్నవాడును, నీలమేఘ శరీరఛాయ గలిగి, ఆజానుబాహుడును, జటలు ధరించినవాడును, రక్తముతో తడిసిన పెద్ద గండ్రగొడ్డలిని చేతబట్టి, మహాతేజోవంతుడగు జమదగ్ని మహర్షి పుత్రుడు ‘పరశు రాముడు’ దశరథునికి ప్రత్యక్షమాయెను. అప్పుడా దశరథరాజు భార్గవరాముని జూచి, భయభ్రాంతుడై, అతిథి పూజలను మరచి, దండప్రణామము జేసి, పుత్రులను రక్షింపుము అని వేడసాగెను. పరశురాముడు వానిని లక్ష్యపెట్టక, క్రోధావేశమునొందినవాడై, మిగుల నిష్ఠురముతో, శ్రీరామునితో, “క్షత్రియాధముడా! (350)

**ద్వంద్వ యుద్ధం ప్రయచ్ఛాశు యది త్వం క్షత్రిఽ యోసిమే ।**
**పురాణం జర్జరం చాపం భక్త్వా త్వం కత్థసే ముదా ॥ 351**

**ఇదం తు వైష్ణవం చాపమారోపయసి చేద్గుణమ్ ।**
**తర్హి యుద్ధం త్వయా సార్ధం న కరోమి నృపాత్మజ ॥ 352**

**నో చేత్సర్వాన్హనిష్యామి క్షత్రియాంతకరస్త్వహమ్ ।**
**ఇతి తద్వచనం శ్రుత్వా రాఘవో వాక్యమబ్రవీత్ ॥ 353**

**వయమేకగుణాః స్వామిన్ యూయం చైవ గుణాధికాః**
**గోవిప్రదేవనారీషు రాఘవా నాస్త్రధారిణః ॥ 354**

**మయ్యైతైశ్చ జీవితాని తవ పాదార్పితాని హి ।**
**యథేచ్ఛం ఘాతయాస్మాకం విప్రైర్యుద్ధం కరోమి న ॥ 355**

**ఇతి బృవతి రామే వై చచాల వసుధా భృశమ్ ।**
**క్రుద్ధం దృష్ట్వా జామదగ్న్యం క్షత్రియాంతముపస్థితమ్ ॥ 356**

**అంధకారో బభూవాథ చక్షుభుః సప్త సాగరాః ।**
**రామో దాశరథిర్వీరో వీక్ష్య తం భార్గవం రుషా ॥ 357**

**ధనురాచ్ఛిద్య తద్ధస్తాదారోప్య గుణమంజసా ।**
**తూణీరాద్బాణమాదాయ సంధాయాకృష్య వీర్యవాన్ ॥ 358**



**ఉవాచ భార్గవం రామః శ్రుణు బ్రహ్మాన్ వచోమమ ।**
**లక్ష్యం దర్శయ బాణస్య హ్యామోఘో రామసాయకః ॥ 359**

**లోకాన్ పాదయుగం వాపి వద శీఘ్రం మమాజ్ఞయా ।**
**ఏవం వదతి శ్రీరామే భార్గవో వికృతాననః ॥ 360**

నీవు ‘రామ’ యని, నాపేరుగలవాడై, చరించెదవు, నీవు క్షత్రియుడగునెడ నాతోడ ద్వంద్వ యుద్ధమును జేయుము. శిథిలమయిన పాతవిల్లును విరిచి, వ్యర్థముగా నిక్కుచున్నావు. ఇదిగో వైష్ణవమగు నా ధనుస్సును ఎక్కుపెట్టినపుడు నీతోడ యుద్ధము చేసెదను. అట్లు చేయకపోయిన క్షత్రియాంతకుడనైన నేను అందరిని చంపివేయుదును,” అని అదిలించెను. అందుకు శ్రీరాముడు, “స్వామీ! మేమొక్క గుణమే గలవారలము. తామే గుణాధికులు, రఘువంశజులు గోవులమీద, బ్రాహ్మణుల మీద, స్త్రీల మీద అస్త్రము వేయువారు కారు. నేనును, వీరును మా ప్రాణములనే మీకప్పగించియున్నాము. తమ ఇచ్ఛవచ్చినట్లు చేయుము, మేము బ్రాహ్మణులతోడి యుద్ధము చేయము,” అని వినయముతో శ్రీరాముడు చెప్పుచుండగా భూమి గడగడవణకెను. క్రుద్ధుడైన పరశురాముని జూచి, క్షత్రియ ప్రళయము సమీపించెను, చీకట్లు క్రమ్మెను, సముద్రములు అల్లకల్లోలమయ్యె. అపుడు వీరుడైన దశరథరాముడు కోపముతో ఆ పరశురాముని జూచి, అతని చేతనున్న ధనస్సును తీసికొని, నారినెక్కుబెట్టి, బాణమును అనుసంధానముజేసి ధనస్సును సంధించి, పరశురామునితో, “బ్రాహ్మణుడా! వినుము. ఈ బాణమునకు ఇపుడు లక్ష్యమును జూపుము. (360)

**సంస్మరన్ పూర్వవృత్తాంతమిదం వచనమబ్రవీత్ ।**
**రామ రామ మహాబాహో జానే త్వాం పరమేశ్వరమ్ ॥ 361**

**పురాణపురుషం విష్ణుం జగత్సర్గలయోద్భవమ్ ।**
**బాల్యేఽహం తపసా విష్ణుమారాధయితుమంజసా ॥ 362**

**గత్వా హి తీర్థే గోమత్యాం తపసా తోష్య శార్‌ఙ్గిణమ్ ।**
**అహర్నిశం మహాత్మానం నారాయణమనన్యధీః ॥ 363**

**యస్యాంశేన మయా భూమ్యామవతారో ధృతోఽస్తి హి ।**
**భూభారరహరణార్థాయ కార్తవీర్యవధేప్సయా ॥ 364**

**తతః ప్రసన్నో దేవేశః శంఖ చక్రగదాధరః ।**
**ఉవాచ మాం రఘుశ్రేష్ఠ ప్రసన్నముఖపంకజః॥** 365

**శ్రీభగవానువాచ**

**ఉత్తిష్ఠ తపసో బ్రహ్మన్ విహితం తే తపో మహత్ ।**
**మచ్చిదంశేన యుక్తస్త్వం జహి హైహయపుంగవమ్ ॥** 366

**కార్తవీర్యం పితృహణం యదర్థం తపసా శ్రమః ।**
**తతస్త్రిః సప్తకృతస్త్వం హత్వా క్షత్రియమండలమ్॥** 367

**కృత్స్నాం భూమిం కశ్యపాయ దత్వా శాంతిముపావహ ।**
**త్రేతాయుగే దాశరథిర్భూత్వా రామోఽహమవ్యయః॥** 368

**ఉత్పత్స్యే పరయా భక్త్యా తదా ద్రక్ష్యసి మాం పునః ।**
**మత్తేజః పునరాదాస్యే త్వయి దత్తం మయా కృతమ్॥** 369

**తదా తపశ్చరన్లోకే తిష్ఠ త్వం బ్రహ్మణో దినమ్ ।**
**ఇత్యుక్త్వాఽన్తర్దధే దేవస్తథా సర్వం మయా కృతమ్॥** 370

శ్రీరామబాణము వ్యర్థముకానిది, కాబట్టి నీవు సాధించిన పుణ్యలోకములను గాని, నీ రెండుకాళ్ళ (గమనము)ను గాని చూపుము," అని చెప్పెను. ఇట్టి రామ వాక్యములను విని, భార్గవుడు వికలుడై, పూర్వవృత్తాంతమును స్మరించుచు, ఇట్లు పలికెను. "రామ! రామ! మహానుభావా! నీవు పరమేశ్వరుడని గ్రహించితిని. నీవే లోక సృష్టి, స్థితి, అంత కారణుడగు పురాణపురుషుడవు, శ్రీమన్నారాయణుడవు, నేను బాల్యమున శ్రీవిష్ణుమూర్తి గురించి తపమొనరించదలచి, గౌతమీ తీర్థమునకు వెడలి, ఎవని అంశముతో నేను భూభారహరణమునకై కార్తవీర్యవధేచ్ఛచేత ఇట్లు భూమిపై అవతరించితినో, అట్టిమహాత్ముడగు నారాయణుని నిరంతరముగా ధ్యానించుచుంటిని. పిదప శంఖ, చక్ర, గదాధరుడు ప్రసన్నుడై నాతో, "తపస్సును చాలింపుము, బ్రాహ్మణుడా! నీ మహాతపస్సు ఫలించినది. నా యొక్క జ్ఞాన శక్తిని కలిగిన నీవు ఈ తపస్సును ఎవనిని జంపుటకై చేయుచున్నావో అట్టి హైహయ వంశ కీర్తికారకుడైన కార్తవీర్యుని జయింపుము. పిమ్మట 21 మార్లు క్షత్రియ సమూహమును సంహరించి, సమస్త భూమండలమును కశ్యపఋషికి దానమిచ్చి, శాంతించుము. త్రేతాయుగమున నేను దశరథరామునిగా అవతరించెదను. మరల నీవు పరమభక్తితో చూడగలవు. **(సశేషం)**



# గురువాచక కోవై

**మూలం : మురుగనార్**
(గత సంచిక తరువాయి)

**నిష్కామ భావము**

**వివరణ : సాయికృష్ణ**

**కోరుకున్న వస్తువు లభించకముందు, మనలోని తీవ్రవాంఛ కారణముగా అణువు కూడ మేరుపర్వతము వలె తోచును. కాని, కోరిన వస్తువు లభించినప్పుడు ఇందుకు పూర్తి భిన్నముగా, మేరు పర్వతము కూడ అణువువలె కన్పించును. మనలోని తీవ్ర వాంఛలు మనలను ఎల్లప్పుడును పేదరికము లోనే నిలిపియుంచును. ఏలననగా, ఎన్నటికిని తీర్చలేని అంతులేని కోరికలను తీర్చుట అసంభవము; అడుగు అందని అగాధమును పూడ్చుట ఎంత అసంభవమో, అంత అసంభవము. అట్టి అగాధమును మన మెక్కడను చూచి యుండలేదు.**

మనము ఎన్నో వస్తువులను, ఎందరినో వ్యక్తులను కోరుకుంటూ ఉంటాము. ఊహలు మధురంగా ఉంటాయి. కాని వాస్తవానికి వచ్చినపుడు దానిలోని మధురత్వం అంతగా కనిపించదు. మనం కోరుకున్నది లభించకముందు అది చాలా గొప్పగా ఉంటుంది. (అనిపిస్తుంది) కోరిక తీరిన తరువాత అంత సంతృప్తి అనిపించదు. మేరు పర్వతం బంగారుకొండ. తృప్తిలేనివారికి అది అవసరం లేదు. తృప్తిలేని వారికి మేరుపర్వతం ఇచ్చినా కూడ సంతోషం కలుగదు. మన కోరికలే మన మనస్సును అశాంతితో ఉంచుతాయి. కోరిక తీరడం కోసం ఎంత వెంపర్లాడుతామో, కోరిక తీరిన తరువాత ఆ తృప్తి, ఆనందం ఎక్కువసేపు ఉండవు. కోరికలు మాత్రము మనలను ఎప్పుడూ అసంతృప్తితో, అశాంతితో ఉంచుతాయి. మనకు కలిగిన కోరికలన్నీ తీర్చుకోవడం, ఎంత ధనవంతులయినా కూడ అసాధ్యం, అసంభవం. అది పూడ్చలేని అగాధము వంటిది. కాబట్టి సాధకులు కోరికలు లేకుండ ఉండాలి. ఉన్నంతలో సద్దుకుని, ప్రశాంతితో స్థిమితంగా ఉండాలి.

తృప్తిని, పూర్ణత్వమును మాత్రమే వాంఛించెడి సత్త్వగుణోపేతులారా! దారిద్ర్యము అనునది 'నాకు ఇది లేదు' అని మనస్సులో తోచెడి ఒక కొఱత, ఒక అసంతృప్తి మాత్రమే. ఈ దారిద్ర్య సాగరమును తరించుటకై లౌకిక సంపదలను సమకూర్చు కొనుటకు బదులుగా, సంపూర్ణమగు చిత్తశాంతిని పొందుట మీకు శ్రేయస్కరము.

కోరికలను తీర్చుకుంటూ పోతుంటే ఎన్నటికీ శాంతమురాదు. నిజమైన శాంతి కావాలంటే భగవంతుని చరణారవిందాలను ఆశ్రయించి నీ స్వరూపమును నీవు తెలుసుకొనుటకు, సద్గురువును ఆశ్రయించి, ప్రయత్నము చేయాలి. ఎంత సంపద సంపాదించినా తృప్తి అనేది ఉండదు. లేని దానికోసం ప్రయత్నించి మనశ్శాంతిని

పోగొట్టుకొనుటకంటె, నీ స్వరూపమును (ఆత్మతత్త్వమును) తెలుసుకొనుటకు ప్రయత్నం చేయాలి. అదే నీకు శ్రేయస్కరము.

**భగవచ్ఛరణములయందు పాదుకొనియున్న మనస్సు పూర్వము వలె దాంపత్య జీవన సుఖలాలసాధీనమై పైకెగసి పిచ్చిగంతులు వేయగలదా?**

సాంసారిక సుఖములలో, భోగములలో, సుఖము లేదని తెలియాలి. తరువాత అసంతృప్తి కలుగుతుంది. రావణాసురుడు సీత వెంటబడి తన చావును తెచ్చుకున్నాడు. కామమును తృప్తి పరచుట ఎవరికీ సాధ్యము కాదు. కోరికలు లేకుండ చేసుకుంటేనే మనస్సుకు శాంతి కలుగుతుంది. సాంసారిక సుఖముల వెంటబడి నీ జీవితము నాశనము చేసుకొనవద్దు. భగవంతుని చరణారవిందములను ఆశ్రయించి మనస్సును వాటియందు అంకితం చేస్తే, మనస్సు సాంసారిక సుఖముల మీదకు పోదు. యయాతి అనుభవం ఇందుకు ఉదాహరణ.

**సకల చిత్తవృత్తి నిర్మూలనమే శ్రేష్ఠమగు బ్రహ్మానంద పదము అని జ్ఞానులు చెప్పుదురు. మనస్సులో ఎట్టి రాగద్వేషములు లేని కామనారహిత స్థితియే అవలంబించదగిన సత్యపథము.**

బ్రహ్మానందము లౌకిక సుఖము వలన రాదు. వాటిలో సుఖము దొరుకుతుంది తప్ప ఆనందము రాదు. ఈ ప్రాపంచిక సుఖాలు క్షణికమయినవి. ఈ ప్రపంచములో సుఖము బహుకొంచెము. కాని పర్యవసానము విపరీతమయిన దుఃఖము. బ్రహ్మ నిష్ఠలో ఉన్న సుఖము అనంతమైనదని శంకరాచార్యులవారు అన్నారు. కోరికలు లేకుండ చేసుకోవడమే కాకుండ, అసలు మనసులో ఏ ఆలోచనలూ లేకుండ చేసుకోవాలి. కోరికలు ఆలోచనలు కాని అన్ని ఆలోచనలు కోరికలు కావు. ఆలోచనల వల్ల అశాంతి మిగులుతుంది. అందువలన ఆలోచనారహితస్థితి రావాలి. చిత్తములో వచ్చే ఏ ఆలోచననైనా అణచివేయాలి. ఆత్మానుభవం కావాలంటే ఆలోచనా రహితస్థితి కావాలి. అప్పుడు కలిగే ఆనందము, మానసిక ప్రశాంతత అంతులేనిది, వర్ణించలేనిది.

సత్యపథము అంటే సత్యమయినటువంటి మార్గము. శాశ్వతత్వానికి మనము చేరుకోవడానికి మనము ప్రయిణించే మార్గము. మనస్సు మన స్వరూపానికి అడ్డంగా నిలిచి ఉన్నందున ఆత్మస్వరూపం అనుభవానికి రావడంలేదు. మనస్సు నిండా అహంకార మమకారములు, రాగద్వేషాలు పేరుకొనిపోయి ఉన్నాయి. వీటిని ఎంత కష్టమయినా సరే కూకటివేళ్ళతో సహా పెకలించివేయాలి. వీటన్నిటి మూలము



'నేను శరీరము' అనే భావన. సత్త్వగుణము చేత రజోతమో గుణములను నశింప చేయాలి. చివరకు ఆ సత్త్వగుణమును కూడ దాటిపోవాలి. మూడు గుణములను వదిలించుకోమని భగవద్గీతలో భగవానుడు చెప్పాడు. సత్త్వగుణములోని మంచి చెడు అనే భేదభావన కూడ నశించి పోయినప్పుడు మనకు పరిపూర్ణమయిన ఆత్మానుభవం కలుగుతుంది. భగవాన్ దొంగలను మంచివారిని కూడ ఒకలాగే చూసేవారు. మంచి చెడు విచక్షణ లేకుండ అంతా బ్రహ్మస్వరూపమేనని అనుకోవాలి. 'పండ' అంటే ఆత్మజ్ఞానము. ఆత్మజ్ఞానము కలిగినవాడు పండితుడు, వారు, విద్యా వినయ సంపన్నులయిన బ్రాహ్మణులనయినను, గోవులనయినను, కుక్కలనయినను, కుక్కమాంసము తినే ఛండాలుడినయిననూ, అందరిని బ్రహ్మస్వరూపములుగానే చూస్తారు. అన్ని ఆలోచనలు నశించి, ఏ భావనలేని స్థితిని పొందాలి. అదియే మన సత్యపథము.

**(మనస్సులో) కామములు కలిగియున్నవారిలోనే, ఆ కామములు నెరవేరుటకు ఆటంకము ఏర్పడినప్పుడు క్రోధము పైకొనును. కనుక క్రోధమునకు మూలము కామము. అరిషడ్వర్గములలో చివరిగా నశించెడిది కామమే.**

కామక్రోధ లోభ మోహ మదమాత్సర్యములనెడి అరిషడ్వర్గములకు నాయకుడు కామము. స్త్రీ పురుష ఆకర్షణ, కోరికలే కామము. ఈ కామము వలననే మిగిలిన ఐదు వర్గములు పైకి లేచుచున్నవి. పైకి లేచి మనలను అధోగతి పాలు చేయుచున్నవి. కావున కామమును పోగొట్టుకోవాలి. ఆ ప్రయత్నం చేస్తూ ఉండగా మిగిలినవి కూడా నశిస్తాయి. చివరగా మనం పోగొట్టుకునేది కామమే. ఈ శరీరం నేను అనే భావనవలననే కామము కలుగుతుంది. సాధన చేయగా చేయగా అరిషడ్వర్గములు నశించి పరిపూర్ణమయిన శుద్ధసత్వస్థితికి చేరుకుంటాము. మహాత్ములందరూ కూడ కామముతో చాల ఇబ్బంది పడ్డారు. ఈ కామము పోగొట్టుకొనుటకు సాధన చేయాలి. గురూపదేశం పొందాలి. వైరాగ్యభావనను పెంచుకోవాలి. విచారణ పట్టు వదలకుండా చేయాలి. బుద్ధుడు నిర్వాణస్థితిని పొందేవరకూ తన పట్టుదల విడువలేదు. విసుగు, నిరుత్సాహము లేకుండ మనము ఎంతవరకు ప్రయత్నము చేయగలమో శక్తివంచన లేకుండ అంతవరకు చేయాలి. చింతన చేయగా, చేయగా కామవాసన పోతుంది. వైరాగ్యాన్ని పెంచుకుంటూ బ్రహ్మభావన చేస్తూ ఉండాలి. కోపము పోగొట్టుకోవాలంటే కోపము మీదనే కోపము తెచ్చుకోవాలి. క్రోధానికి మూలము కామమే. ఏ కోరికలు లేకుండ ఉండడము మనకు కావలసినది. నిస్సంకల్ప స్థితియే ముక్తి. నీ మనసే సంసారము. మనస్సు శుద్ధి చేసుకుంటే ముక్తి కలుగుతుందని ఉపనిషత్తు చెబుతుంది. **(సశేషం)**

## దక్షిణామూర్తి స్తోత్రం

# మానసోల్లాసం -13

(ఏప్రియల్ సంచిక తరువాయి) వాఖ్యాత - వింజమూరి రాధాకృష్ణ

శంకర భగవత్ పాదులు రచించిన దక్షిణామూర్తి స్తోత్రానికి వారి తదనంతరం శృంగేరి పీఠాన్ని అధిష్టించిన వారి ప్రథమ శిష్యులైన శ్రీ సురేశ్వరాచార్యులు వ్రాసిన మా మానసోల్లాసం వార్తికలో శంకరుల అద్వైతాత్మక సృష్టివాదమునకు పూర్వపక్షము చేసిన నయ్యాయికులు, వైశేషికులు వారికి ధీటైన సమాధానము ఇచ్చుటకు గాను సురేశ్వరాచార్యులు వారి ప్రమాణములు ఉటంకించుట ఏప్రియల్ 2025 శాంతి పత్రికలో చూచినాము. దీనిని కొనసాగించుచూ...

**26. ఉత్ క్షేపణ మా పక్షేపో గమనం చ ప్రసారణమ్**
**ఆకుంచనమితి ప్రాహుః కర్మ పంచవిధం బుధాః**

బుధాః=పండితులు, కర్మ=కర్మను, ఉత్ క్షేపణం= పైకి విసురుట, అపక్షేపః= క్రిందికి పడవేయుట, గమనం= పొందుట, ప్రసారణం= ముందుకి చాపుట, ఆకుంచనం= ముడుచుకొనుట, ఇతి= అని, పంచవిధం= ఐదు విధములుగా, ప్రాహుః= చెప్పుచున్నారు?

పండితులు కర్మలు 5 విధములని చెప్పుచున్నారు. అవి 1. పైకి విసరుట, 2. క్రిందకు పడవేయుట, 3. పొందుట, 4.ముందుకు చాచుట, 5. ముడుచుకొనుట

**27. సామాన్యం ద్వివిధం ప్రోక్తం పరం చాపరమేవ చ**
**పరం సత్తైవసర్వత్ర తదనుస్యూతవర్తనమ్**

సామాన్యం=సామాన్యముగ, ద్వివిధం= రెండు విధములు, పరం=పెద్దది, చ= మరియు, అపరం = చిన్నది, సత్ ఏవ= ఉనికి, తథా=అట్లు, తదనుస్యూతవర్తనం= దానిననుసరించ కలిగిన

సామాన్యమును రెండు విధములుగా విభజించవచ్చు. వానిలో ఒకటి పెద్దది రెండవది చిన్నది. అందుచే అన్నిటికంటే పెద్దది. ఈ పెద్దదానిలో దాగి ఉన్న ద్రవ్య గుణములు మరియు ఉనికి మొదలగువానిలో గల భేదములు కారణంగా అవి అసంఖ్యాకములు.



**28. ద్రవ్యత్వం చ గుణత్వాద్యం సామాన్యమపరం తథా**
**విశేషాః స్యురసంతాస్తే వ్యావృత్తి జ్ఞాన హేతవః**

ద్రవ్యత్వం= ద్రవ్యత్వం, చ= మరియు గుణత్వాద్యం=గుణత్వము మొదలైన లక్షణములు, అపరం=చిన్నవి, సామాన్యం= సాధారణంగా, వ్యావృత్తి జ్ఞాన హేతవః= భేద జ్ఞాన కారణముగా, విశేషాః= విశేషములు, అనంతాః= అనంతములై అనగా లెక్కకు మించిన, స్యుః= ఉండును.

ద్రవ్యగుణములు, ఉనికి మొదలైనవి చిన్న సామాన్యములు. ఇట్టి భేదజ్ఞాన కారణములైన విశేషములు లెక్కలేనన్ని ఉన్నవి.

**29. రూపస్యేవ ఘటమఘటే నిత్యసంబంధసమవాయకః**
**కాలాకాశ దిగాత్మనో, నిత్యాశ్చ విభవశ్చతే**

ఘటే=కుండలో, రూపస్య ఇవ= రూపముతో సంబంధం వలె నిత్యః=నిత్యమైన, సంబంధః= సంబంధము, సమవాయకః=సమవాయుము, కాలాకాశ దిగాత్మనః= కాలము ప్రకాశము దిక్కు ఆత్మలు, నిత్యాః=నిత్యములు అనగా ఎల్లప్పుడూ ఉండునవి, చ=మరియు, తే=అవి, విభవఃచ=అనేక ఆకృతులు కలిగి ఉండును.

ఘటమునందు అనేక రూపములు ఉన్నవానిలో గల నిత్యమైన సంబంధమునకు సమవాయమని పేరు. కాలము ఆకాశము దిక్కు ఆత్మ. ఇవి. ఎల్లప్పుడూ ఉండునవి. ఇవి విభువులు కూడా అనగా అనంతమైనవి దేనితో పోల్చాలనుకున్నా ఇవి వాని కన్నా పెద్దవి.

**30. చతుర్విధాః పరిఛిన్నా నిత్యాశ్చ పరమాణవః**
**ఇతి వైశేషిక మతే పదార్ధాః షట్ ప్రకీర్తితాః**

చతుర్విధాః= నాలుగు విధములైన, పరమాణవః= పరమాణువులు, పరిఛిన్నాః= వేరువేరుగా ఏర్పడి ఉన్నవి, చ=మరియు, నిత్యాః= నిత్యములు అనగా ఎల్లప్పుడూ ఉండునవి. ఇతి=అని, వైశేషికమతే=వైశేషికులమతమున, షట్=ఆరు, పదార్ధాః= పదార్ధములు, ప్రకీర్తితాః= చెప్పబడినవి.

వైశేషికులు పరమాణువులు చతుర్విధములని మరియూ అవి వేరు వేరుగాను నిత్యముగాను ఉండగలవని చెప్పిరి. వైశేషికులు మూల పదార్ధములు ఆరు లని తెలిపిరి. అవి వరుసగా 1. పదార్ధము (కంటికి కనిపించే ద్రవ్యము)2. గుణము, (పంచేంద్రియములకు ద్యోతకమగు లక్షణము-రంగు రుచి మొదలైన) 3. కర్మ (చర్య)

4.సామాన్య=(సాధారణ) 5.విశేష (ప్రత్యేక) 6.సమవాయ (విభజించుటకు వీలులేని ఏకత్వ లక్షణం) పిదప కొందరు అభావము అను ఏడవ లక్షణం కూడా చేర్చిరి. అభావము అనగా 'లేదు' అని అర్థము.

1. వైశేషికుల ప్రాథమిక భావములను తెలిపిన పిదప సురేశ్వరాచార్యుల వారు సాంఖ్యతత్వం గూర్చి వివరించిరి.

**31. మాయ ప్రధానమవ్యక్త మవిద్యాజ్ఞాన మక్షరమ్**
**అవ్యాకృతం చ ప్రకృతిస్తమ ఇత్యభిధీయతే**

ప్రకృతిః=ప్రకృతి, మాయ= మాయ, ప్రధానం= ముఖ్యము. అవ్యక్తం= వ్యక్తము కాని, అవిద్య=విద్యలేని, అజ్ఞానం=అజ్ఞానము, అక్షరం= అక్షరము, అవ్యాకృతం= వ్యక్తము చేయలేనిది, చ= మరియు, తమః=తమస్, ఇతి=అని, అభిధీయతే= చెప్పబడినది.

మూల ప్రకృతిని మాయ, ప్రధానము, అవ్యక్తము, అవిద్య, అజ్ఞానము, అవ్యాకృతం అని సాంఖ్యులు వ్యవహరింతురు. ఈ శ్లోకము మొదలుకొని 40వ శ్లోకము వరకు సురేశ్వరాచార్యులు సాంఖ్యశాస్త్రమును వివరించిరి. సాంఖ్యులు కూడా ఈశ్వరుడు ఉండుటను అంగీకరింతురు. భగవద్గీతలో కూడా సాంఖ్యయోగం ఈయబడినది.

**అర్థం - వ్యర్థం**

**శిఖరం ఎక్కడం**
**ఎంత కష్టమో,**
**శిఖరం దిగడమూ**
**అంతే కష్టం,**
**తీరం నుంచి**
**సముద్రం ఈదడం**
**ఎంత కష్టమో,**
**సముద్రం నుంచి**
**తీరానికి చేరడం**
**అంతే కష్టం.**
**జీవితంలో**
**విజయాలు**
**సాధించటం**
**ఎంత కష్టమో,**
**అవి నిలుపు**
**కోవడం**
**అంతే కష్టం.**
**ఈ జీవిత అర్థం,**
**అర్థం కాకపోతే**
**జీవితం వ్యర్థం**
**అర్థమవుతే,**
**జీవితం**
**అర్థవంతం**

**మలిశెట్టి**
**శ్రీనువాస రంగారావు**
**(బన్ను)**



## అనుమానము

**ఆంగ్లమూలము: స్వామి ఓంకార్ అనువాదం : గరిగిపాటి కృష్ణ**

అనుమానించే స్వభావం కలిగిన స్త్రీపురుషులు అత్యంత ప్రమాదకారులే కాక ఈ భూమిపై నివసించే జీవులందరిలోనూ దుర్భరమైన జీవులనే చెప్పవచ్చు. అనుమానం వలన వారి జీవితాలు దుర్భరం అవ్వడమే కాక వారి చుట్టుప్రక్కల వారందరి జీవితాలను కూడా దయనీయమైన అవస్థలోకి నెట్టివేస్తారు. వారు స్వతహాగా దుర్బలులవడంతో, ప్రతి వ్యక్తిని, ప్రతి విషయాన్ని అనుమానాస్పదంగా భావిస్తారు. అటువంటి వ్యక్తులు ఎదురైనప్పుడు వారి నుంచి వీలైనంత దూరంగా వెళ్ళిపోవడం మనకు మంచిది.

ఆత్మ, సత్యము, అంతరంగంలో ప్రకాశించే జ్యోతి స్వరూపము దృఢమైన వారికి సొంతము అవుతుంది గాని, నీడను వెంబడించే వారికి, వారి జన్మహక్కు అయిన ప్రకాశాన్ని వదిలి చీకటిని ఇష్టపడే వారైన దుర్బరులకు ఆ ఆత్మస్వరూపము ఎన్నటికీ గోచరించదు. తాడును చూసి పామనుకొని భ్రమించే వారి బ్రతుకును తలుచుకుంటే ఎంతో వింతగాను, విచారించవలసిన విషయంగాను అనిపిస్తుంది. సర్పభ్రాంతి, వారిని సహజంగానే భయానికి, ఆందోళనకు గురిచేస్తుంది. అటువంటి నిర్బలుల సాంగత్యంలో ఉన్నవారు కూడా దురదృష్టవశాత్తు సర్పభ్రాంతిలోకి నెట్టివేయబడతారు. దానితో అందరూ అజ్ఞానమనే అంధకారంలో కూరుకుని పోతారు. ఈ సృష్టి అంతా భగవంతుని స్వయం ప్రకాశ స్వరూపమైనప్పుడు, ఎవరినైనా ఎందుకు అనుమానించాలి అనే ప్రశ్న ఉద్భవించక మానదు. నీవు తాడులో పాముని చూసి, నీ యొక్క జీవితాన్ని నికృష్టము చేసుకొనడమే కాక, నీ చుట్టుప్రక్కల వారిని కూడా ఎందుకు దుఃఖానికి గురి చేయాలి? అందరి హృదయాలలో విరాజమానుడైన ఏకాత్మ స్వరూపాన్ని చూసి వారిని సంతోషపెట్టి, నీవు కూడా సుఖాన్నెందుకు పొందవు? ఆ విధంగా చేసినట్లయితే మనలోని ఆత్మను చూడడమే గాక, ఆ ఆత్మయే స్వయంప్రకాశంతో వెలిగి వారిలోని చైతన్యానికి ప్రతిబింబంగా గుర్తించ గలుగుతావు. నిజానికి, ఈ విశ్వమంతా నిండి ఉన్నది, దానికాధారభూతమైనది, ఆత్మ స్వరూపమేనన్న సత్యాన్ని నీవు గ్రహించాలి. అసలు ఈ అనుమానం అనేది ఎక్కడ నుంచి పుట్టింది? అది నీలో ఉన్న ఈశ్వరుని గుర్తించకపోవడం వల్ల కలిగే అభావము. నీవు నీలో నిండి ఉన్న ప్రకాశాన్ని చూడలేకపోతే, నీవు చీకటిలో బ్రతుకుతూ ఆ చీకటి అంతటా అలుముకున్నట్లు భ్రమిస్తావు. అందుకు విజ్ఞులైన మన ఋషులు, సత్యమును మనిషి ఒక్క క్షణంమైనా విస్మరిస్తే అది మరణంతో సమానం అని

వక్కాణించారు. భగవంతుని పట్ల మనము ఒక క్షణకాలంపాటు ఏమరపాటు చెందిన, అది మరణంతో సమానం. అందుచేత, మనలో నిండి ఉన్న స్వయంప్రకాశముతో విరాజమానమైన భగవంతుని గుర్తించలేకపోవడమే మనలను అనుమానం అనే అంధకారంలోకి నెట్టి వేస్తుంది. అంతేకాక ఆ తప్పుడు ఆలోచనా విధానం కొనసాగితే, అనుమానం అనే జాడ్యం బలంగా వేళ్ళూనుకుంటుంది. అందుకు స్వామి రామతీర్థ ఇలా అంటారు. “నీలో ఉన్న ఈశ్వరుని అనుమానించడం కంటే, నా ఛాతిలోకి తుపాకీ గుండు దూసుకు వెళ్ళడం అంతగా బాధపడవలసిన విషయం కాదు.” ఆయన విజ్ఞతతో కూడిన మాటలనే నేను మళ్ళీ నిశ్చయంగా చెబుతున్నాను. “ఏవిధమైన సంశయమును కలిగి ఉండడంకన్నా, నీ ఛాతిలో ఒక అణుబాంబును ఉంచుకోవడం మేలైన వియం.” నీ పవిత్రమైన హృదయ కుహరము అసూయ, అనుమానము మరియు ఆందోళన రహితంగా ఉండాలి. అనుమానం అనేది సత్యదూరమైన భయాలకు నిలయం అవుతుంది. అంతేకాక అది దమనుల స్తంభింపచేసి, నరాలను అచేతనంగా చేస్తుంది. శరీరంలో నిరంతరం జరిగే రక్తప్రసరణ విషపూరితమై, మనిషిని జీవచ్ఛవంలా మారుస్తుంది. మీ హృదయాలలో అనంతము, అనాది అయిన ప్రకాశము దేదీప్యమానంగా వెలుగొందుగాక!

ప్రియమిత్రులారా! ప్రకాశము మీ దివ్య వారసత్వం అయినప్పుడు, మీరు అనుమానం అనే దౌర్బల్యానికి లొంగిపోవాలి? భగవంతుని స్వయం ప్రకాశమానమైన ఉనికిని ఎల్లెడలా గుర్తించి, మౌనంగా ఉండండి. ఈ ప్రకాశము మీలోపల, బయట, పైన, క్రిందనే కాక అంతటా నిండి ఉన్నది. మీరు ప్రకాశస్వరూపులు అంతేకాక, ఈసృష్టిలో కనిపించేదంతా ప్రకాశమే తప్ప వేరొకటి కాదు. ఎందుకంటే ఆ ప్రకాశము అవిచ్ఛిన్నము, సర్వవ్యాపి కూడా అయి ఉన్నది. అంతటా ప్రకాశము తప్ప వేరొకటి లేదని గుర్తించండి. మీరు ఎంత త్వరగా అనుమానం అనే భయంకరమైన జాడ్యము నుంచి బయటపడతారో అది మీకు గాక మీరు ప్రేమించేవారికి, మీ సన్నిహితులకు అందరికీ ఎంతో ప్రయోజనకారి అవుతుంది. అనుమానం అనే ఈ దుర్బలత నుండి మీరు బయటపడాలంటే, కనీసం రోజుకు రెండుసార్లు ధ్యానాన్ని చేయడం అలవాటు చేసుకోండి. ఆరంభంలో మీలో అంతర్లీనంగా ఉన్న ప్రకాశం మీద ధ్యానాన్ని నిలపండి. క్రమేణా ధ్యానంలో అదే ప్రకాశాన్ని మీలోనూ, మీకు వెలుపల, మీ కుటుంబసభ్యులలో, మిత్రులలో చూడండి, అంతేగాక ఆ ప్రకాశము సర్వత్ర నిండి ఉన్నది కనుక దానిని అంద విహీనులలోను, మీరు శత్రువులుగా భావించే వారిలోనూ కూడా చూడడం మొదలుపెట్టండి.



ఓ పూజనీయమైన దివ్య ప్రకాశమా! మాకు దివ్యచక్షువులను ప్రసాదించుము. ఆ దివ్యచక్షువులతో, మేము అనంతము, అనాది, అనేకములైన సూర్యుల ప్రకాశమునకు సమానమైన తేజోమయమైన ప్రకాశమును గాంచెదము గాక! ఎటువంటి విపత్కర పరిస్థితులలోనైనా, నీ సంగమును వీడకుండా ఉండే శక్తిని మాకు ప్రసాదింపుము. మేము రజ్జు-సర్పభ్రాంతికి లోనై మాయాపాశంలో బంధింపబడకుండా, మమ్మల్ని దీవించుము. మేము మా జీవిత పరమ లక్ష్యమైన నీలోనే నెలకొనియుందుము గాక!

ఏ కోశానా అనుమానం అనేది లేక నిరంతరం జ్యోతులకు జ్యోతి అయిన భగవంతునితో తాదాత్మ్యత చెందినవారు ధన్యులు. అటువంటి వ్యక్తులకు మాత్రమే పరమ శాంతి లభిస్తుంది. కానీ మరెవరికి అటువంటి ఉన్నతమైన స్థితి ఎన్నటికీ కలుగదు. మనము ఎవరి పట్ల ఏ రకమైన శంకనుగాని, అనుమానమును గాని కలిగి ఉండడంకన్నా, మన హృదయాలయాలలో ఒక తుపాకీ గుండునో, లేక ఒక అణుబాంబునో ఉంచుకోవడం సరియైనదని గ్రహిద్దాం. అందుచేత మనము, మనలోగాని, ఇతరులలో గాని సత్యమనే ప్రకాశమునే చూడాలని దృఢంగా నిశ్చయం చేసుకుందాం. ఆ విధంగా మనం జీవించగలిగితే, మనము ప్రకాశమానమైన విశ్వంతో అనుసంధానం చెందడమే గాక, సమస్త మానవాళికి మన జీవితాలు అనుసరణీయమవుతాయి. అందరూ శాంతితో జీవించెదరు గాక!

**ఓం తత్ సత్ ఓం**

నాకు తెలీని మిత్రులకు నన్ను పరిచయం చేశావు. నావికాని ఇళ్ళల్లో నాకు స్థానమిచ్చావు. దూరాన్ని దగ్గర చేశావు. పరదేశిని నా సోదరుణ్ణిగా మార్చావు.

నా కలవాటైన నివాసాల్ని విడవాలంటే కష్టంగా వుంటుంది. కొత్తలో పాత ఇమిడి వుందనీ, అక్కడా నువ్వు వున్నావనీ మరిచిపోతాను.

జన్మలో మృత్యువులో ఈ లోకంలో ఇతర లోకాల్లో, ఎక్కడెక్కడ నువ్వు నన్ను తిప్పినా, అపరిచితమైన దానికి నా హృదయాన్ని ఆనందబంధాలతో ఎప్పుడూ జతపరిచే నా అనంత జీవితపథచారివినీవే.

నిన్నెరిగిన వాడికి పరుడనేవాడు లేడు. మూసిన తలుపే వుండదు. అనేకత్వపు లీలలో ఏకత్వ స్పర్శ నానందాన్నించి ఎన్నడూ తప్పిపోకుండా వుండాలనే నా ప్రార్థనని కటాక్షించు.

## విరాళములు

1. శ్రీమతి రమాదేవి గారు (హైదరాబాదు) 5,000/-
2. శ్రీ దేవానంద్ గారు (హైదరాబాదు) 3,000/-
3. డా॥ చెన్నాప్రగడ కేశవరావు గారు (కాకినాడ) 50,000/-
   విద్యానిధి నిమిత్తం
4. శ్రీమతి సి.హెచ్.అనసూయమ్మ గారు (హైదరాబాదు) 3,000/-
   శివరాత్రి దీపారాధన నిమిత్తం
5. సుజాత వేప మెమోరియల్ ట్రస్టు (గోవా) 20,000/-
   బాలికల విద్య నిమిత్తం
6. శ్రీ పాలపర్తి హరికుమార్ శర్మ గారు (శాంతి ఆశ్రమం) 70,000/-
   విద్యాఖర్చుల నిమిత్తం
7. మిస్.వెంకట భరతలక్ష్మి ముత్తంగి గారు (కాకినాడ) 12,000/-
   శ్రీ ముత్తంగి సూర్యారావు గారి జ్ఞాపకార్థం
8. శ్రీ సీతారామ సేవా ట్రస్టు (హైదరాబాదు) 5,000/-
9. శ్రీ వి.వి. రాఘవరావు గారు (హైదరాబాదు) 10,010/-
10. శ్రీ మర్రి కృష్ణారెడ్డి మెమోరియల్ & ఛారిటబుల్ ట్రస్టు
    (సికింద్రాబాదు) విద్యాఖర్చుల నిమిత్తం 36,000/-
11. శ్రీ కొల్లి ప్రసాద్ గారు (శాంతి ఆశ్రమము) 5,000/-
12. శ్రీమతి యేపూరి పద్మావతి గారు (గొల్లప్రోలు) 5,000/-
    వీరి భర్త వై.గోవిందరాజుగారి జ్ఞాపకార్థం అన్నదానం
13. డా॥ నాగులాపల్లి అప్పారావు గారు & శ్రీమతి నళిని గారు
    (కాకినాడ) విద్యాఖర్చుల నిమిత్తం 10,000/-
14. శ్రీ సానిపిని భీమేశ్వరావు (శాంతి ఆశ్రమము) 10,000/-
15. శ్రీమతి చనమోలు సుచరిత గారు (విజయవాడ) 10,000/-
    విద్యాఖర్చుల నిమిత్తం
16. శ్రీమతి పి.ఎస్.స్వర్ణలత గారు (ఆనంద ఆశ్రమము) 20,000/-
17. శ్రీ రెడ్నం సత్య శుభకర్ గారు (హైదరాబాదు) 10,116/-
    వీరి భార్య శ్రీమతి ఆర్.రత్నశ్రీ జ్ఞాపకార్థం అన్నదానం



18. శ్రీమతి డి.వి. కనకదుర్గ గారు (విశాఖపట్నం)
    (శాంతి ఆశ్రమం) వీరి భర్త
    శ్రీ డి.వి. ఆంజనేయులు గారి జ్ఞాపకార్థం అన్నదానం 5,000/-

## శాశ్వతఅన్నదానం

1. శ్రీమతి పి.భారతీరావు గారు (బెంగుళూరు)
   వీరి కుమార్తెగారి అల్లుడు సిద్ధార్థ తాత
   జన్మదినము సందర్భముగా 10,000/-
2. శ్రీ దారపు చిరంజీవి నర్సింహారెడ్డి గారు (కాకినాడ)
   వీరి తండ్రిగారు చెన్నారెడ్డి
   (డి.వెంకటరమణ రెడ్డి గారి జ్ఞాపకార్థం) 10,000/-
3. శ్రీమతి కె.శ్రీలక్ష్మి గారు (విశాఖపట్నం) 10,000/-
4. డా॥కె.లీలా దేవి గారు (తుని)వారి సోదరుడు
   శ్రీ ఎమ్.కృష్ణకుమార్ గారి జ్ఞాపకార్థం 10,000/-
5. శ్రీమతి పప్పల అనసూయాదేవి గారు (విశాఖపట్నం) 50,000/-
   శ్రీ యర్రబోలు గున్నయ్య నాయుడు, యర్రబోలు మాణిక్యమ్మ
   శ్రీ రొబ్బ గంగారావు, శ్రీమతి రొబ్బ గంగమ్మ, శ్రీ యరబ్రోలు
   వెంకట రంగారావు గారి తరపున సంక్రాంతి రోజు అన్నదానం
6. శ్రీమతి బైపల్లి ప్రశాంతి గారు (విశాఖపట్నం) 10,000/-
   వీరి భర్త శ్రీ బి.రమేష్ గారి జన్మదినము సందర్భముగా
7. డా॥ బైపల్లి రమేష్ గారు మరియు శ్రీమతి ప్రశాంతి గారు
   వీరి తల్లిదండ్రులు శ్రీమతి బి.సరోజినీదేవి,
   శ్రీ బి. దుర్యోధన్ గార్ల పెండ్లిరోజు సందర్భముగా
   (విశాఖపట్నం) 10,000/-
8. శ్రీ బైపల్లి దుర్యోధన్ గారు, శ్రీమతి సరోజినీ దేవి గారు
   (విశాఖపట్నం) వీరి తండ్రి బి.అప్పనగారి జ్ఞాపకార్థం 10,000/-

# దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 7815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

# శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ.100/-, జీవిత చందా రూ.1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం.11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

# విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi -110001

A/c Name : The Mission of peace - FCRA A/c No : 40127798428

Swift Code : SBININBB104



# కార్యక్రమములు-మాతృఆశ్రమం

**తేది. 02-05-2025 (శుక్రవారం):** శంకర జయంతి సందర్భంగా అష్టోత్తర శతనామార్చన నిర్వహించబడును.

**తేది. 22-05-2025 (గురువారం):** హనుమజ్జయంతి సందర్భంగా దిగువ ప్రార్థనామందిరంలో ఉ॥7.30 ని॥లకు శ్రీ ఆదిశంకరాచార్య మరియు హనుమాన్ అష్టోత్తర శతనామార్చన మరియు హనుమాన్ చాలీసా పారాయణము నిర్వహించబడును.

**తేది. 28-05-2025 (బుధవారం):** బుద్ధ జయంతి సందర్భంగా సా॥ 6.00 గం॥ల నుండి 7.00 గం॥ల వరకు నిర్వాణమందిరమునందు ధ్యానము జరిపించబడును.

| | |
|---|---|
| **1. మాతృ ఆశ్రమం**<br>శ్రీ శాంతి ఆశ్రమము<br>తోటపల్లి కొండలు,పిన్ : 533 446<br>వయా శంఖవరం, కాకినాడ జిల్లా<br>సెల్ :7382009962<br>రిసెప్షన్ : 7815890094<br>e-mail : srisanthiashram@gmail.com | **4. కోటగిరి శాఖ**<br>పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,<br>కోటగిరి-643217, నీలగిరిజిల్లా,<br>తమిళనాడు,<br>ఫోన్ : 04266- 271945<br>e-mail: vsvmsktg@yahoo.com<br>vsvmsktg@gmail.com |
| **2. విశాఖ : శాంతి ఆశ్రమము**<br>లాసన్స్‌బే, పెదవాల్తేరు-530 017<br>విశాఖపట్నం<br>ఫోన్ : 0891 - 2538689<br>e-mail : srisanthiashramvsp@gmail.com | **5. కాకినాడ శాఖ**<br>శాంతి ఆశ్రమము,అశోక్ నగర్<br>కాకినాడ - 533 004<br>కాకినాడ జిల్లా |
| **3. విశ్వశాంతి క్షేత్రం**<br>కైలాసగిరి<br>విశాఖపట్నం | **6. పిఠాపురం శాఖ**<br>స్టువర్టు పేట,<br>పిఠాపురం-533 450<br>కాకినాడ జిల్లా |

Website : www.srisantiashram.org

# శ్రీ శాంతి ఆశ్రమ ప్రచురణలు

| | |
|---|---|
| 1. శాంతి ప్రదాత శ్రీ స్వామి ఓంకార్ ఆత్మకథ | 100/- |
| 2. ఓంకార సద్బోధామృతము | 70/- |
| 3. సోహం | 10/- |
| 4. ఓం జపం | 10/- |
| 5. మౌనపు ఘడియలు | 30/- |
| 6. ప్రేమయే దైవము | 10/- |
| 7. భగత్సాక్షాత్కారము ఇప్పుడు ఇక్కడే | 10/- |
| 8. శాంతి దళములు | 10/- |
| 9. ఆధ్యాత్మిక మెరుపులు | 10/- |
| 10. సత్సంగ సందేశములు | 30/- |
| 11. ఓంకార సూక్తులు | 10/- |
| 12. ఓంకార స్తోత్ర కదంబం | 10/- |
| 13. శాంతి సూక్తులు | 10/- |
| 14. శాంతి ప్రార్థన | 20/- |
| 15. శ్రీ శాంతి స్తోత్రమాల | 30/- |
| 16. స్వామి ఓంకార్ ఆత్మదర్శిని | 20/- |
| 17. సందేశ తరంగిణి | 40/- |
| 18. నా చెల్లి పునర్జన్మ | 10/- |
| 19. నేను ఆంగ్లభాష ఎలా నేర్చుకొన్నాను. | 20/- |
| 20. శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామి స్తోత్రము | 20/- |
| 21. శాంతి దూత స్వామి ఓంకార్ | 30/- |
| 22. స్వామి ఓంకార్ జీవిత విశేషాలు | 10/- |
| 23. శ్రీ శాంతి ఆశ్రమ చరిత్ర (1917-2020) | 100/- |
| 24. ధ్యానము | 30/- |
| 25. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి దివ్య సందేశములు దేశ విదేశీయ పర్యటనలు | 50/- |
| 26. ప్రార్థనలు - ధ్యానములు | 20/- |
| 27. విశ్వ ప్రార్థన | 20/- |
| 28. శ్రీ శాంతి ఆశ్రమం శతాబ్ది సంచిక | 120/- |
| 29. నిత్య సందేశములు | 20/- |
| 30. ఆంతర్య భావనలు | 20/- |
| 31. శ్రీ ఓంకార బోధామృతం | 20/- |
| 32. నాల్గు దశలలో ఉపదేశము | 10/- |
| 33. శాంతి ప్రార్థన - స్వామి ఓంకార్ | 20/- |

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57, Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2024-2026

# SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

| | |
|---|---|
| 1. Auto Biography of swami Omkar (2 Volumes) | Rs. 150/- |
| 2. Life and Teachings of Swami Omkar | Rs. 10/- |
| 3. Soham | Rs. 10/- |
| 4. Cosmic Fast | Rs. 20/- |
| 5. Meditation | Rs. 10/- |
| 6. Om Japa | Rs. 10/- |
| 7. Control of Mind | Rs. 30/- |
| 8. Cosmic Flashes | Rs. 10/- |
| 9. In the Hours of Silence | Rs. 10/- |
| 10. The Soul of Omkar | Rs. 10/- |
| 11. How I learned English | Rs. 10/- |
| 12. Reincarnation of my Little Sister | Rs. 10/- |
| 13. God Realization Now and Here | Rs. 10/- |
| 14. Mystic Prayers and Poems | Rs. 20/- |
| 15. The Divine Voice of Omkar | Rs. 40/- |
| 16. Auto Biography of Omkar (Revised Edition) | Rs. 100/- |
| 17. Petals of Peace | Rs. 20/- |
| 18. The Story of my life and Work | Rs. 10/- |
| 19. Priceless legacy of Swami Omkar | Rs. 10/- |
| 20. The Four Initiations | Rs. 10/- |
| 21. Musings | Rs. 20/- |
| 22. Peace Prayer | Rs. 20/- |

**THE MISSION OF PEACE**

**శ్రీ శాంతి ఆశ్రమము**

పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
కాకినాడ జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

______________________

______________________

______________________

Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda